వ్యవసాయ విజ్ఞాన కేంద్రాలు..ఆర్బీకేలు

అన్నదాతకు వ్యవసాయంలో అండగా నిలిచేందుకు ప్రభుత్వం ఆర్బీకేలను ఏర్పాటు చేసింది. భూసార పరీక్షల నుంచి విత్తన నాణ్యత, ఎరువులు, అద్దెకు యంత్ర పరికరాలు, సాగు పద్ధతులను తెలుసుకునేందు వివిధ రకాల పుస్తకాలతో గ్రంథాలయం, డిజిటల్ టీవీలు అందుబాటులో ఉంచింది. అలాగే పంటల సాగులో రైతులకు సలహాలు, సూచనలు ఇచ్చేందుకు సిబ్బందిని నియమించింది. దిగుబడులను అక్కడే కొనుగోలు చేస్తుండటంపై హర్షం వ్యక్తమవుతోంది.

- ముంగిటకే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు
- నాలెడ్జ్ హబ్‌లుగా తీర్చిదిద్దిన ప్రభుత్వం
- రైతులకు అండగా టోల్ ఫ్రీ నంబర్ 155251
- అందుబాటులో విత్తనాల నాణ్యత పరిశీలన యంత్రం
- కస్టమ్ హైరింగ్ సెంటర్ల ద్వారా అద్దెకు యంత్ర పరికరాలు


రైతు భరోసా కేంద్రం


ఆర్బీకేలో నిల్వ ఉంచిన ఎరువులు

ఆళ్లగడ్డ : ఆర్‌బీకే కేంద్రాలు గ్రామస్థాయిలోనే నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగు మందుల సరఫరాతో పాటు మార్కెటింగ్ సౌకర్యం కల్పిస్తూ సాంకేతిక పరిజ్ఞానం అందించే వేదికలుగా ప్రభుత్వం తీర్చిదిద్దింది. వ్యవసాయ సేవలన్నీ ఒకే చోట అందుతుండటంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. నియోజవర్గంలోని ఆరు మండలాల్లో 81 రైతు భరోసా కేంద్రాలు ఉన్నాయి. వీటి పరిధిలో రైతులకు నాణ్యమైన విత్తనాలు, గుర్తింపు పొందిన కంపెనీలకు చెందిన రసాయనిక ఎరువులు, పురుగుల మందులు, వ్యవసాయ ఉపకరణాలు వాస్తవ ధరలకే స్థానికంగా అందుతున్నాయి. శాస్త్రవేత్తలు, అధికారుల సూచనలు, సలహాలు సకాలంలో అందేలా, ఆధునిక సాగు పద్ధతులకు అనుగుణం సాంకేతిక సహకారం పొందేలా ఏర్పాటు చేసిన రైతు భరోసా కేంద్రాలు మంచి ఫలితాలనిస్తున్నాయి.

విజ్ఞాన కేంద్రాలుగా..

రైతు భరోసా కేంద్రా ద్వారా మండల వ్యవసాయాధికారులు గ్రామ వ్యవసాయ అసిస్టెంట్‌లతో కలిసి రైతులకు అవగాహన కల్పించే సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఎరువులు, విత్తనాలు, పురుగు మందులు, తెగుళ్ల, నివారణ చర్యలు, ఆధునిక వ్యవసాయం, దిగుబడుల ధరలు గురించి తెలుసుకునేందుకు వివిధ రకాల పుస్తకాలతో లైబ్రేరీలను ఏర్పాటు చేసింది. అలాగే నూతన సమాచారం తెలుసుకునేందుకు డిజిటల్ టీవీ అందుబాటులో ఉంచింది. ఇక్కడే నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని అందించంతో పాటు అవసరమైన శిక్షణ ఇస్తున్నారు. మినీ భూసార పరీక్ష కేంద్రం, విజ్ఞాన ప్రదర్శలతో రైతులకు విలువైన సమాచారాన్ని తెలియజేసి అవగాహన కల్పిస్తున్నారు.

రైతుకు అండగా 'టోల్‌ఫ్రీ

రైతుల పంటల సాగు మెళకువలు తెలుసుకునేందుకు రైతు భరోసా కేంద్రాల్లో సమాచార కేంద్రాన్ని ఏర్పాటు చేసింది. ఇందుకోసం ప్రత్యేకంగా 155251 టోల్‌ఫ్రీ నంబర్‌ను కేటాయించింది. పంటల సాగులో రైతులకు సందేహాలుంటే టోల్‌ఫ్రీకి ఫోన్ చేసి నివృతి చేసుకోవచ్చు. వారి సమస్యలకు 24 గంటల్లో పరిష్కారం లభిస్తుంది. ఈ సమాచార కేంద్రం ఉదయం 7 నుంచి రాత్రి 7 గంటల వరకు పనిచేస్తుంది.

అందుబాటులో విత్తన పరీక్ష యంత్రం..

రైతులు సాగు చేసే సమయంలో విత్తనాల నాణ్యతను పరిక్షించేందుకు అవసరమైన విత్తన నాణ్యత యంత్రాలు కూడా ఈ కేంద్రాల్లో ఏర్పాటు చేశారు. వీటి ద్వార విత్తనాల నాణ్యతతో పాటు మొలక శాతాన్ని ఉచితంగా పరిశీలించుకునే అవకాశం ఉంది.

మండలాల వారీగా ఆర్బీకేలు, సాగు విస్తీర్ణం, రైతులు

మండలం	ఆర్బీకేలు	సాగు విస్తీర్ణం (ఎకరాల్లో)	రైతులు
రుద్రవరం	16	16,542	9,713
దొర్నిపాడు	9	10,574	4,360
ఆళ్లగడ్డ	12	19,250	11,280
శిరివెళ్ల	16	18,967	10,794
ఉయ్యాలవాడ	11	18,344	5,794
చాగలమర్రి	17	20,147	12,546

నాణ్యమైన విత్తనాలు..

సబ్‌డివిజన్ పరిధిలో రైతులు వరితో పాటు మెట్ట, వాణిజ్య పంటలను సాగు చేస్తారు. దీన్ని దృష్టిలో పెట్టుకుని ఈ ఏడాది నుంచి విత్తనాలను కూడా ఆర్బీకేల ద్వారా రైతులకు అందించేందుకు ఏర్పాట్లు చేసింది. వీటిల్లో పత్తి, మిరప, జొన్న, మొక్కజొన్న, వివిధ రకాల కూరగాయల విత్తనాలు అందుబాటులో ఉండనున్నాయి.ఇప్పటికే 26 జాతీయ విత్తన కంపెనీలతో ఒప్పందాలు చేసుకుంది.

ఎంతో ఉపయోగం..



ఇదివరకు సాగులో సమస్య ఉంటే ప్రభుత్వ కార్యాలయల చుట్టూ తిరిగేవాళ్లం. ఇప్పుడు టోల్‌ఫ్రీ నంబర్‌తో పంటల సాగు, తెగుళ్ల నివారణపై ఫోన్ చేస్తే ఏమందులు వాడాలి, ఎలా వాడాలనే వాటిపై మా సెల్ ఫోన్‌కు మెసేజ్ వస్తోంది. జగనన్న వ్యవసాయానికి పెద్ద పీట వేస్తున్నాడు.

–రామకృష్ణ, రైతు, కోటకందుకూరు

మొలక శాతం నిర్ధారణతో కల్తీకి కళ్లెం



గతంలో విత్తనాలు వేసి మొలక వచ్చిన తరువాత విత్తనాలు సరిగా లేవని తెలిసేది. దీంతో తీవ్రంగా నష్టపోయేవాళ్లం. ఇప్పుడు ఆర్‌బీకేల్లో ఏర్పాటు చేసిన మిషన్ ద్వారా విత్తనాల నాణ్యత, మొలకల శాతం కూడా ఉచితంగా తెలుపుతున్నారు. దీంతో నకిలీ విత్తనాలకు కళ్లెం వేయొచ్చు. రైతులు నష్టపోయే అవకాశముండదు.

– గజ్జల రంగస్వామి రెడ్డి , రైతు, బాచ్చాపురం

నాణ్యమైన దిగుబడులు పెంచడమే లక్ష్యం



టోల్‌ఫ్రీ నంబర్ ద్వారా వ్యవసాయ, అనుబంధ రంగాలపై శాస్త్రవేత్తల ద్వారా సూచనలు, సలహాలు పొందవచ్చు. విత్తన నాణ్యత పరిశీలన యంత్రం ద్వారా విత్తనాల నాణ్యతతో పాటు, మొలక శాతం తెలుసుకోవచ్చు. వ్యవసాయ, అనుబంధ రంగాల్లో నాణ్యమైన దిగుబడులు సాధించడమే లక్ష్యంగా చర్యలు తీసుకుంటున్నాం

– రామ్మోహన్‌రెడ్డి, ఏడీఏ, ఆళ్లగడ్డ

క్లుప్తంగా

కాళికాంబకు ప్రత్యేక పూజలు


అమ్మవారికి పూజలు చేస్తున్న పండితులు

నంద్యాల(వ్యవసాయం): స్థానిక శ్రీకాళికాంబ చంద్రశేఖరస్వామి దేవస్థానంలో శుక్రవారం సందర్భంగా కాళికాంబ దేవికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారి మూలవిరాట్‌కు ఉదయం సుప్రభాతసేవ,పంచామృతాభిషేకం చేసి పట్టువస్త్రాలతో అలంకరించారు. అమ్మవారికి ఒడి బియ్యం కార్యక్రమం, మహామంగళ హారతులు ఇచ్చారు. అనంతరం రాహుకాల పూజలు నిర్వహించారు. సాయంత్రం అమ్మవారి ఉత్సవ మూర్తిని ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఆశీనులు గావించి ఆలయ ప్రాకారంలో ప్రదక్షిణలు చేపట్టారు. చివరగా నవవిధ హారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు.

ఇంటి వద్దనే కొనుగోళ్లు


మాట్లాడుతున్న ఏఓ శ్రీకృష్ణ

దొర్నిపాడు: జొన్న దిగుబడిని రూ.2,970 ప్రకారం ఇళ్ల వద్దకే వచ్చి కొనుగోలు చేస్తారని మండల వ్యవసాయాధికారి శ్రీకృష్ణ తెలిపారు. శుక్రవారం స్థానిక రైతు భరోసా కేంద్రంలో ఆర్బీకే స్థాయి సలహా కమిటీ సమావేశం నిర్వహించారు. జొన్న కొనుగోళ్లపై రైతులకు అవగాహన కల్పించారు. వీఏఏలు శేఖర్‌రెడ్డి,మల్లిఖార్జున, ఎంపీఈఓ సురేష్ పాల్గొన్నారు.

పాఠశాలలకు అగ్ని మాపక యంత్రాలు


ఉయ్యాలవాడ ఎమ్మార్సీ కార్యాలయానికి చేరిన యంత్రాలు


ఉయ్యాలవాడ : మండలంలో మొదటి విడత నాడు- నేడు కింద ఎంపికై నిర్మాణం పనులు పూర్తయిన 12 పాఠశాలలకు అగ్ని మాపక సహాయ యంత్రాలు మంజూరయ్యాయని ఇన్‌చార్జ్ ఎంఈఓ అనురాధ తెలిపారు. శుక్రవారం ఆమె మాట్లాడుతూ అల్లూరు, పెద్దయమ్మనూరు, ఉయ్యాలవాడ మోడల్ స్కూల్, పుచ్చకాయలపల్లె కస్తూర్బా పాఠశాలలకు రెండు చొప్పున ఇంజేడు, ఉయ్యాలవాడ, కాకరవాడ, హరివరం ప్రాథమిక పాఠశాలకు ఒక్కొక్కటి ప్రకారం యంత్రాలు వచ్చాయని చెప్పారు. ఆయా పాఠశాలలకు త్వరలో అందజేయనున్నట్లు ఎంఈఓ పేర్కొన్నారు.

వీరశైవ ఆగమ సలహాదారుగా శశిభూషణ్ సిద్ధాంతి


ప్రమాణస్వీకారం చేస్తున్న శశిభూషణ్


నంద్యాల(వ్యవసాయం): పట్టణానికి చెందిన కొలనుభారతి పంచాగకర్త, వీరశైవ ఆగమ పండితుడు శ్రీబసవేశ్వర దేవాలయ పండితుడు శశిభూషణ్ సిద్ధాంతి వీరశైవ ఆగమ సలహాదారుగా గురువారం నియమించబడ్డారు. రాష్ట్ర దేవదాయ ధర్మదాయ శాఖ మంత్రి కొట్టు సత్యనారాయణ అధ్యక్షతన కమిషనర్ జవహర్‌లాల్ సంయుక్త కమిషనర్ చంద్రశేఖర్ ఆజాద్ సమక్షంలో ప్రమాణస్వీకారం చేశారు.

బుంగ జనార్ధనకు డాక్టరేట్


డాక్టరేట్ అందుకుంటున్న జనార్ధన

నంద్యాల(సిటీ): తిరుపతి జాతీయ సంస్కృత విశ్వ విద్యాలయ రెండో స్నాతకోత్సవంలో విశ్వవిద్యాలయ ఛాన్సలర్ ఎన్ గోపాలస్వామి చేతుల మీదుగా బుంగ జనార్ధన గురువారం గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. అవుకు మండలం లింగంబోర్డు గ్రామానికి చెందిన బుంగ నారాయణ, బుంగలక్ష్మీదేవి కుమారుడు జనార్ధన సాంఖ్యయోగ విభాగంలో గౌరవడాక్టరేట్ పొందారు.

నంద్యాలకు వెళ్లి పింఛన్ అందజేత


సుబ్రహ్మణ్యంకు ఫింఛన్ అందజేస్తున్న వలంటీర్ లక్ష్మీకాంత్

ఉయ్యాలవాడ : సుద్దమల్ల గ్రామానికి చెందిన సుబ్రహ్మణ్యం గత నెల 20 ఇంటి పై కప్పు పడటంతో తీవ్రంగా గాయపడి నంద్యాలలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న వలంటీర్ లక్ష్మీకాంత్‌గౌడ్ శుక్రవారం నంద్యాలలో బంధువుల ఇంట్లో ఉన్న ఆయనకు పింఛన్ సొమ్ము అందజేశాడు.

రవీంద్రారెడ్డిని గెలిపించండి


మున్సిపల్ కార్యాలయ ఉద్యోగులను ఓటు అభ్యర్థిస్తున్న వెన్నపూస గోపాల్‌రెడ్డి

నంద్యాల(అర్బన్): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిది సంక్షేమ ప్రభుత్వమని, సీఎం బలపరిచిన పట్టభద్రుల శాసన మండలి సభ్యుడు వెన్నపూస రవీంద్రారెడ్డికి మొదటి ప్రాధాన్యత ఓటు వేసి గెలిపించాలని శాసన మండలి సభ్యులు, ప్రభుత్వ విప్ వెన్నపూస గోపాల్‌రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణలలోని కలెక్టరేట్, ఆర్‌డీఓ, అగ్రికల్చర్, రెవెన్యూ, ట్రెజరీ, మున్సిపాలిటీ తదితర ప్రధాన శాఖల్లోని ఉద్యోగులను కలిసి రవీంద్రారెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. మున్సిపల్ కార్యాలయ ఆవరణలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మికులకు సంబంధించిన అన్ని డిమాండ్లను పరిష్కరించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని చెప్పారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, బడుగు, బలహీన వర్గాలు, మైనార్టీలకు ప్రభుత్వం ప్రాధాన్యతను ఇస్తోందన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్ జనరల్ సెక్రటరీ ప్రసాద రెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్ కైపరాముడు, సాయి రాంరెడ్డి, రామసుబ్బయ్య పాల్గొన్నారు.

శిరివెళ్ల: పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ వైఎస్సార్‌సీపీ అభ్యర్థి వెన్నుపూస రవీంద్రారెడ్డిని గెలిపించాలంటూ శుక్రవారం మండల కేంద్రంలో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు ప్రచారం చేశారు. వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్ పట్టభద్రులకు కరపత్రాలను అందజేశారు. ఈ నెల 13వ తేదీన జరగనున్న పోలింగ్ ఆయనకు మొదటి ప్రాధాన్యత ఓటు వేయాలని కోరారు. ముజాఫర్, ఉప సర్పంచు ఇంతియాజ్ పాల్గొన్నారు.

సోదర భావంతో ఉరుసు జరుపుకోవాలి



మాట్లాడుతున్న డీఎస్పీ సుధాకర్‌రెడ్డి


ఆళ్లగడ్డ: మతసామర్యసానికి ప్రతీకగా జరగనున్న పెద్దవంగలి దస్తగిరి దర్గా ఉరుసును సోదర భావంతో కలిసికట్టుగా జరుపుకోవాలని ఆళ్లగడ్డ డీఎస్పీ సుధాకర్‌రెడ్డి తెలిపారు. చాగలమర్రి మండలం పెద్దబోధనంలో శుక్రవారం ఏర్పాటు చేసిన గ్రామ పెద్దల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఉరుసులో శాంతి భద్రతలకు విఘాతం ఏర్పడకుండా సంయమనంతో వ్యవహరించాలని సూచించారు. పోలీస్ సిబ్బందికి సహకరించాలని కోరారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

సాఫీగా సర్వసభ్య సమావేశం


మాట్లాడుతున్న ఎంపీడీఓ మధుసూదన్ రెడ్డి

రుద్రవరం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శుక్రవారం ఎంపీపీ బాలస్వామి అధ్యక్షతన ఎంపీడీఓ మధుసూదనరెడ్డి ఆధ్వర్యంలో మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశం ఎలాంటి వాగ్వాదాలు లేకుండా సాఫీగా సాగింది. వివిధ శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలను చదివి వినిపించారు. అలాగే చేపట్టనున్న కార్యక్రమాలను సభ దృష్టికి తెచ్చారు.గ్రామాల్లో తాగునీటి సమస్య నెలకొనకుండా ముందస్తు జాగ్రత్తలు చేపట్టామని, అలాగే మండలంలోని ఐదు గ్రామాల్లోని లే అవుట్ కాలనీల్లో నీటి సరఫరాకు పైప్‌లైన్ వేయించామని ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ప్రమోద్ తెలిపారు. మండలంలో మొదటి,రెండు విడతల్లో కుడా కింద 2,012 గృహాలు మంజూరు చేశామని 196 గృహాలు వివిధ దశల్లో ఉన్నాయని హౌసింగ్ ఏఈ నాగరాజు వివరించారు. మండలంలో 19వేల పశువులు ఉన్నాయని వేసవిలో గాలికుంటు వ్యాధి బారిన పడకుండా ఉండేందుకు టీకాలు వేస్తున్నామని రైతులు సద్వినియోగం చేసుకోవాలని పశు వైద్యాధికారి మనోరంజన్ ప్రతాప్, 16 ఆర్బీకేల పరిధిలో 1,250 టన్నుల ఎరువులు అందుబాటులో ఉన్నాయని వ్యవసాయాధికారి జ్యోతి తెలిపారు. అడవికి నిప్పు పెట్టొద్దని, వన్యప్రాణులను వేటాడటం నేరమని రుద్రవరం సెక్షన్‌అధికారి నాగరాజు పేర్కొన్నారు. ప్రత్యేక అధికారి గిడ్డయ్య,ఎంపీటీసీలు, సర్పంచులు,పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.



దిగువ అహోబిలంలో మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డిని ఆశీర్వదిస్తున్న పండితులు


ఎగువ అహోబిలంలో నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి

అహోబిలేశుడి సేవలో..

ఆళ్లగడ్డ: అహోబిల లక్ష్మీనృసింహస్వామి బ్రహ్మోత్సవాల సందర్భంగా స్వామి, అమ్మవార్లను మండలి విప్ గంగుల ప్రభాకర్ రెడ్డి, నంద్యాల ఎంపీ పోచా బ్రహ్మానందరెడ్డి శుక్రవారం వేర్వేరుగా దర్శించుకున్నారు. గంగుల ప్రభాకర్ రెడ్డి దిగువ అహోబిలంలో స్వామి, అమ్మవార్లను దర్శించుకొని పీఠాధిపతి ఆశీస్సులు పొందారు. అలాగే ఎంపీ పోచా ఎగువ, దిగువ అహోబిలంలో వెలసిన శ్రీ లక్ష్మీనరసింహస్వామిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ మర్యాదల్లో భాగంగా అర్చకులు తీర్థప్రసాదాలు, ఆశీర్వచనాలు అందజేశారు.

వ్యక్తి ఆత్మహత్య


మృతి చెందిన రాఘువేంద్ర

ఆళ్లగడ్డ: పట్టణ శివారులోని పడకండ్లలో రాఘవేంద్ర (36)ఆత్మహత్య చేసుకున్నట్లు పట్టణ ఎస్‌ఐ తిమ్మయ్య తెలిపారు. రాఘవేంద్రకు వ్యవసాయంలో అప్పులు కావడంతో ఆ బాధతో మద్యానికి బానిసయ్యాడు. మనస్తాపానికి లోనై శుక్రవారం ఇంట్లో ఎవరూ లేని సమయంలో పై కప్పుకు ఉరి వేసుకున్నాడు. గమనించిన కుటుంబ సభ్యులు కిందికి దించే సరికే మృతి చెందాడు. భార్య కోటేశ్వరి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నామని ఎస్‌ఐ చెప్పారు.

వైఎస్సార్‌సీపీ అభ్యర్థులను గెలిపించండి


మాట్లాడుతున్న ఎమ్మెల్యే శిల్పా రవి

నంద్యాల(అర్బన్): పశ్చిమ రాయలసీమ పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ బలపరిచిన అభ్యర్థి వెన్నపూస రవీంద్రారెడ్డి. ఉపాధ్యాయ ఎమ్మెల్సీ అభ్యర్థి రామచంద్రారెడ్డిని గెలిపించాలని ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి కోరారు. శుక్రవారం పట్టణంలోని పలు కళాశాలలు, విద్యాసంస్థల్లో ప్రచారం నిర్వహించారు. గురురాజ విద్యాసంస్థల్లో జరిగిన కార్యక్రమంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ అభ్యర్థుల విజయానికి పట్టభద్రులు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. బసవేశ్వరరెడ్డి, సిద్ధం శివరాం పాల్గొన్నారు.

చెంచు గూడేల్లో వసతులు కల్పించండి

నంద్యాల: జిల్లాలోని 42 చెంచు గూడేల్లో తాగు నీరు, పక్కా ఇళ్లు, విద్యుత్ తదితర మౌలిక వసతులు కల్పించాలని జిల్లా కలెక్టర్ మనజీర్ జిలానీ శామూన్ ఐటీడీఏ, సంబంధిత అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాల్‌లో చెంచు గూడేల అభివృద్ధి కార్యక్రమాలపై అధికారులతో కన్వర్జెన్సీ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ టి.నిశాంతి, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి రవీంద్రనాథ్ రెడ్డి తదితర అధికారులు పాల్గొన్నారు. అనంతరం లింగ నిర్ధారణ, వడదెబ్బ సోకకుండా తీసుకోవాలసిన జాగ్రత్తలపై రూపొందించిన పోస్టర్లను ఆవిష్కరించారు.

ఘనంగా షానేషావలి ఉరుసు

శిరివెళ్ల: స్థానిక శ్రీ హజరత్ సయ్యద్ షానేషావలి ఉరుసు శుక్రవారం ఘనంగా జరిగింది. కులమతాతల కతీతంగా భక్తులు తరలివచ్చారు. దర్గా ముజావర్లు ఖాజాఉశేని, అల్లాబకాష్, దాదాబాషా స్వామి వారికి పూజలు చేశారు. జెడ్పీ వైస్ చైర్మన్ దిల్షాద్ నాయక్, ఎంపీపీ నాయక్ వసీం, వక్ఫ్‌బోర్డు జిల్లా మాజీ ఉపాధ్యక్షుడు బి.అబ్దుల్ సలాం, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు నజీర్, ఎంపీపీ నాయక్ వసీం, సర్పంచు సాలమ్మ, ఉప సర్పంచ్ ఇంతియాజ్, ముల్లా అన్వర్‌బాషా స్వామికి పూజలు చేసి మొక్కు లు తీర్చుకున్నారు. రాత్రి ఖవ్వాలీ పోటీలు జరిగాయి.

బైకు దొంగకు జైలు శిక్ష

దొర్నిపాడు: మండల కేంద్రంలో ఈ ఏడాది జనవరి నెలలో జరిగిన బైక్ దొంగతనం కేసు నిందితుడికి కోర్టు నెల రోజుల జైలు శిక్షతో పాటు రూ.3వేల జరిమానాను విధించినట్లు ఎస్‌ఐ తిరుపాల్ తెలిపారు. ప్రకాశం జిల్లా మార్కాపురంలోని పూల సుబ్బయ్య కాలనీకి చెందిన అబ్దుల్ ఖలీల్ బైక్ చోరీ కేసులో నిందుతుడిగా ఉన్నాడు. ఆయనను శుక్రవారం అరెస్టు చేసి కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి శిక్ష,జరిమానా విధించినట్లు చెప్పారు.

పశువులకు టీకాలు

శిరివెళ్ల: మండలంలో పశువులకు గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమాన్ని మండల పశువైద్యాధికారి దస్తగిరి శుక్రవారం ప్రారంభించారు. ఆయన మాట్లాడుతు పాడి పశువులు, చూడి పశువులు, ఎద్దులు, 4 నెలల వయస్సు పైబడిన దూడలకు గాలికుంటు నివారణ టీకాలు వేస్తున్నామన్నారు. వెంకటేశ్వరపురంలో 54, కాదరబాదరలో 348 పశువులకు టీకాలు వేశామని చెప్పారు.

వేడుకగా మల్లికార్జునుడి కల్యాణం

నందికొట్కూరు: కొణిదేల గ్రామంలో శ్రీమత్కొణిదేల భ్రమరాంబా మల్లికార్జునస్వామి వార్ల కల్యాణోత్సవం గురువారం రాత్రి అంగరంగ వైభవంగా జరిగింది. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలి వచ్చి ఈ వేడుకను తిలకించారు. గ్రామ సర్పంచు నవీన్, ఎంపీటీసీ సురేష్, ధర్మకర్తలు, గ్రామ పెద్దలు స్వామి,అమ్మవార్లను కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు.

రైతులను ఆదుకునేందుకే దిగుబడుల కొనుగోలు

గోస్పాడు: శనగ రైతులను ఆదుకునేందుకే ప్రభుత్వం శనగ దిగుబడులకు మద్దతు ధర ప్రకటించిం, కొనుగోలు చేస్తోందని వ్యవసాయాధికారి అబ్దుల్‌హక్ తెలిపారు. మండలంలోని పసురపాడు గ్రామంలో వ్యవసాయ సలహా మండలి సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జొన్నలతో పాటు శనగలను కూడా కొనుగోలు చేసేలా ప్రభుత్వం మద్దతు ధరను ప్రకటించిందన్నారు. అందులో భాగంగా క్వింటా శనగలు రూ.5,335 మద్దతు ధర ప్రకారం కొనుగోలు చేసిందని చెప్పారు. మండల పరిధిలోని గ్రామాల్లో దాదాపు 2వేల ఎకరాల్లో శనగ పైరు సాగు చేశారని చెప్పారు. రైతులు గరిష్టంగా 70 క్వింటాళ్ల వరకు విక్రయించేందుకు అవకాశం ఉందన్నారు. శనగలను అమ్మాలనుకునే రైతులు ముందుగా ఆర్‌బీకేల్లో తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. అలాగే మద్దతు ధరతో కొనుగోలు చేసిన జొన్నలను గోడౌన్‌కు తరలిస్తున్నట్లు తెలిపారు. జొన్నలు విక్రయించిన రైతులకు తమ ఖాతాల్లో డబ్బులు వెంటనే జమ అవుతున్నాయని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

ముగిసిన ఆలయ వార్షికోత్సవం



జగజ్జననీ ఉత్సవమూర్తిని తీసుకొని వస్తున్న వేదపండితులు, పూజల్లో పాల్గొన్న భక్తులు

నంద్యాల(వ్యవసాయం): పట్టణంలోని జగజ్జననీ దేవాలయంలో ఆలయ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం ముగిశాయి. చివరి రోజు లోక కల్యాణం కోసం చండీ హోమం నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారి మూలవిరాట్‌కు తెల్లవారుజామునే సుప్రభాతసేవ, పంచామృతాభిషేకాలు చేపట్టారు. అనంతరం వేదపండితులు ముత్తలూరి ఆంజనేయశర్మ ఆధ్వర్యంలో చండీ హోమం జరిపించి బలిప్రధానం, పూర్ణాహుతి గావించారు. సాయంత్రం దేవాలయ ఆవరణం, గోపురాలను భక్తులు తెచ్చిన పూలమాలలతో సుందరంగా అలంకరించారు. ఎమ్మెల్యే శిల్పా రవిచంద్రకిశోర్‌రెడ్డి దేవాలయాన్ని దర్శించుకొని ప్రత్యేక పూజలు చేశారు.

గ్యాస్ ధరల పెంపును ఉపసంహరించుకోవాలి


గ్యాస్ సిలిండర్లతో నిరసన వ్యక్తం చేస్తున్న దృశ్యం

నంద్యాల(అర్బన్): వంట గ్యాస్ సిలిండర్‌పై రూ.50, వాణిజ్య సిలిండర్‌పై రూ.350 పెంచుతూ కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి రమేష్‌కుమార్ కోరారు. పెంచిన గ్యాస్ ధరలను తక్షణమే ఉపసంహరించుకోవాలని కోరుతూ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని బాబుజగ్జీవన్ రావు సర్కిల్ వద్ద వంట గ్యాస్ సిలిండర్లతో వినూత్నంగా నిరసన చేపట్టారు. ఆయన మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం పేదలను నాశనం చేసేందుకే ఇలాంటి చర్యలకు పాల్పడుతోందని మండిపడ్డారు. బీజేపీ ప్రభుత్వం పేదలను దోచి కార్పొరేటర్లను సంపన్నులను చేస్తోందని ఆరోపించారు. కార్యక్రమంలో నాయకులు తోటమద్దులు, పుల్లా నరసింహులు, లక్ష్మణ్, వెంకటలింగం, తిరుపాలమ్మ, మరియమ్మ, శివ, మధు, సుధాకర్ పాల్గొన్నారు.

వేడుకగా విగ్రహ, ధ్వజ ప్రతిష్ఠ


ధ్వజస్తంభాన్ని ప్రతిష్ఠించిన దృశ్యం,


బండలాగుతున్న ఎద్దులు

రుద్రవరం: మండలంలోని చిన్నకంబలూరులో సీత, కోదండ రామ, లక్ష్మణ, హనుమంతుల విగ్రహ ప్రతిష్ఠోత్సవం వేడుకగా సాగింది. శుక్రవారం వేద పండితులు యంత్రస్థాపన, విగ్రహాల,ధ్వజ ప్రతిష్ఠ,బలిహార, షోడశోపచార పూజలు చేపట్టారు. ఈ సందర్భంగా గ్రామస్తుల ఆధ్వర్యంలో ఎద్దుల బండలాగుడు పోటీలు ఏర్పాటు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన 11 జతల ఎద్దులు పోటీల్లో పాల్గొన్నాయి. గెలుపొందిన ఎద్దుల యజమానులకు బహుమతులు అందజేశారు.

ఉద్యోగుల సస్పెన్షన్ తొలగింపు

నంద్యాల(సిటీ): మున్సిపల్ పరిధిలో సస్పెన్షన్‌కు గురైన సీ4 క్లర్క్ మల్లికార్జున, సచివాలయ ఉద్యోగులు రామాంజనేయులు, రమణారావుపై సస్పెన్షన్ ఎత్తివేసినట్లు మున్సిపల్ అసిస్టెంట్ కమిషనర్ వెంకటదాసు శుక్రవారం తెలిపారు. ఆయన మాట్లాడుతూ లాంగ్‌లీవ్‌లో ఉన్న సచివాలయ ఉద్యోగులకు వేతనాలు అందించినందున సీ4 క్లర్క్‌ను, సహచర సచివాలయ ఉద్యోగుల నుంచి ప్రాన్ అకౌంట్ కోసం రూ.700 వసూలు చేసినందుకు ఇద్దరు సచివాలయ సిబ్బందిపై గతేడాది ఆగస్టు 22న మున్సిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి సస్పెన్షన్ వేటు వేశారన్నారు. అయితే గత వారంలో సీ4 మల్లికార్జునను డిప్యూటేషన్‌పై బేతంచెర్లకు, వార్డు వెల్ఫేర్ డెవలెప్‌మెంట్ సెక్రటరీలుగా విధులు నిర్వహిస్తున్న ఎం. రామాంజనేయులును 3వ వార్డు నుంచి 18వ వార్డుకు, వీ రమణారావును 38వ వార్డు నుంచి 8వ వార్డు సచివాలయానికి బదిలీ చేస్తున్నట్లు ఆదేశాలు జారీ చేశామని వివరించారు.